నేడు ఎస్‌పి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈనెల ఎనిమిదో తేదీన రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో నిర్వహించడం లేదని తెలిపారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వైద్య పరీక్షలు సరే...

- నీటి కాలుష్యం సంగతి తేల్చాలంటున్న కృష్ణాపురం గ్రామస్తులు
- నివేదికల్లో ఏమీ లేదని చెప్తున్న అధికారులు
- సమగ్ర పరీక్షలు చేయాలని స్థానికుల డిమాండ్
- కృష్ణాపురంలో 121 మందికి కిడ్నీ వ్యాధి పరీక్షలు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కృష్ణాపురంలో రక్త పరీక్షలు చేస్తున్న చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

పొందూరు మండలం కృష్ణాపురంలో కిడ్నీ వ్యాధులు ప్రబలడంపై వైద్యారోగ్య శాఖ కదిలింది. 'ప్రజాశక్తి'లో ఈనెల ఏడో తేదీన 'కృష్ణాపురాన్ని కబళిస్తున్న కిడ్నీ మహమ్మారి' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నవీన్ నాగపవన్, అనూష లఖినేన ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. 121 మంది రక్త నమూనాలను సేకరించారు. వ్యాధి ఎంతమందికి ఉందో తెలుసుకోవడం కన్నా కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణాలు తెలుసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో రెండు, మూడు పర్యాయాలు నీటి పరీక్షలు చేసినా ఏమీ లేదని అధికారులు నివేదిక ఇస్తున్నారని, ఏమీ లేకపోతే కిడ్నీ వ్యాధి బారిన ఎందుకు పడుతున్నారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పొందూరు మండలంలోని కృష్ణాపురంలో ఒక్కొక్కరుగా కిడ్నీ వ్యాధి బారిన పడుతుండడంతో గ్రామస్తులు కలవరపాటుకు గురవుతున్నారు. సుమారు 2,500 జనాభా కలిగిన ఈ గ్రామంలో ఇప్పటికే సుమారు 20 మంది మృతి చెందగా, మరో 20 మంది వ్యాధి సోకి మంచాన పడ్డారు. గ్రామంలో మొదటిసారిగా 35 ఏళ్ల వయసులోనే కాయల శ్రీను అనే వ్యక్తి 2018 జనవరిలో మృతి చెందాడు. అప్పట్నుంచి ఏటా కిడ్నీ వ్యాధుల కేసులు పెరుగుతూ వస్తున్నాయంటూ గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రస్తుతం 22 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, ఇందులో గార వెంకటమ్మ, గార లక్ష్మణరావు డయాలసిస్ చికిత్సను పొందుతున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం, బోర్లు నుంచి ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి నెలా నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తున్నా, నివేదికల్లో ఎటువంటి లోపాలు కనిపించడం లేదంటూ అధికారులు చెప్తున్నారు. గత నెలలో శ్రీకాకుళంలోని ల్యాబ్‌లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నీటి పరీక్షలు చేసినా, వారూ అదే నివేదిక ఇచ్చారు. దీంతో నివేదికపై గ్రామస్తులు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కిడ్నీ వ్యాధులకు నీటి నాణ్యతపైనే గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నీటి నాణ్యత పైనే గ్రామస్తుల అనుమానం

ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్‌ఎసిఎల్) విడిచిపెడుతున్న రసాయనిక వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఫ్యాక్టరీకి సమీప గ్రామాలైన కేశవదాసుపురం, భగవాన్‌దాసుపేట, నరసాపురం అగ్రహారం, నందివాడ, బురిడికంచరాం, లోలుగు తదితర గ్రామాల ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడిన గతంలో అనేక కేసులు నమోదయ్యాయి. కృష్ణాపురం గ్రామం కంపెనీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో, కిడ్నీ ప్రభావిత గ్రామమైన లోలుగుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో దాని ప్రభావం ఉందని భావిస్తున్నారు. తాగునీటి కాలుష్యం కాకపోతే కిడ్నీ వ్యాధి సోకడానికి మరే కారణమో అధికారులు తేల్చాలని, ఆ దిశగా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

నివేదిక ఎవరు జారీ చేస్తున్నారో తెలియడం లేదు

నీటి నాణ్యతపై పరీక్షలు చేస్తున్నా నివేదికలో ఏవో వివరాలు ఉంటున్నాయి. నివేదికను ఎవరు జారీ చేశారో, ఏ ల్యాబ్‌లో చేశారో కూడా తెలియడం లేదు. నీటి పరీక్షల నివేదికను స్టాంపు వేసి ఇవ్వాలంటే అధికారులు ఇవ్వడం లేదు. గ్రామానికి సమీపంలో ఉన్న ఎన్‌ఎసిఎల్ కర్మాగారం నుంచి వెలువడుతున్న కాలుష్య కారకాలపై అధికారులు దృష్టిసారించాలి.

- కె.శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి, కృష్ణాపురం

కిడ్నీ వ్యాధి కారణాలు తెలుసుకోవాలి

గ్రామంలో కిడ్నీ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంది. వ్యాధికి గల కారణాలు తెలుసుకుని దాని నివారణకు చర్యలు చేపట్టాలి. ఏటా కేసులు పెరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొంటున్నాయి. దీనికి వైద్య సిబ్బంది సరైన చర్యలు చేపట్టడం లేదు.

- గార వెంకటరమణ, మాజీ సర్పంచ్, కృష్ణాపురం

మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

- రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- వంత పాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- పంట భూములు కారుచౌకగా కార్పొరేట్లకు...
- ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయించుకోవడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అన్నారు. ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన స్వామినాథన్ శత జయంతి సభలో ఆయన మాట్లాడారు. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్ స్వామినాథన్ అని కొనియాడారు. జాతీయ వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా రైతులకు గిట్టుబాటు ధర కోసం సి-2+50 ఫార్ములాను రూపొందించి ప్రభుత్వం ముందుంచారని గుర్తుచేశారు. రైతులను ఆదుకుంటామని కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి, రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. పంటలు పండే భూములను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నాయని, దీనికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంత పాడుతోందని విమర్శించారు. భారతదేశం వ్యవసాయ రంగంలో సమృద్ధి సాధించడంలో స్వామినాథన్ కృషి మరువలేనిదన్నారు.

ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పనిచేసి సకల సౌకర్యాలను విడిచిపెట్టి భారతదేశానికి వచ్చారని చెప్పారు. ప్రముఖ వరి పరిశోధన కేంద్రం కటక్‌లో పరిశోధకునిగా మొదలుపెట్టి అఖిల భారత స్థాయిలో ఉన్నత స్థాయికి ఎదగడం ఆయన మేధస్సుకు, స్వయంకృషికి నిదర్శనమన్నారు. మన దేశ ప్రధాన ఆహార పంటలైన గోధుమ, వరి అధిక దిగుబడులు సాధించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. ఐక్యరాజ్యసమితి ద్వారా మొదటి ప్రపంచ ఆహార పురస్కారం అందుకోవడమే ఆయన కృషికి నిదర్శనమన్నారు. మహిళా రైతుల హక్కుల కోసం, వ్యవసాయరంగ అభివృద్ధి కోసం, సమగ్ర భూ, రైతు, రక్షణ సమస్యలపై రాజ్యసభ సభ్యునిగా ప్రస్తావించిన ఘనత స్వామినాథన్‌కే చెల్లుతుందన్నారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రమణ, పి.ప్రసాదరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కె.అప్పారావు, టి.అజయ్, టి.నందివాడు, ప్రకాష్, రామకృష్ణ, టి.భాస్కరరావు, కె.బాలాజీ, కె.పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబరు 13వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా మూడు, నాలుగో అదనపు జడ్జిలు సిహెచ్.వివేకానంద్ శ్రీనివాస్, ఎస్.ఎం ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ లోక్‌అదాలత్‌పై న్యాయవాదులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలన్నారు. ఇందుకు న్యాయవాదులు చొరవ తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.దామోదరరావు, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులు జి.వాసుదేవరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు 'ఉల్లాస్'

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నిరక్షరాస్యత రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త మిషన్‌గా అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమం చేపడుతున్నట్లు డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు కిరణ్ కుమార్, సుధాకరరావు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి అరుంధతీ దేవి, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. నగరంలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లాస్థాయిలో ఒకరోజు శిక్షణా శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 1,12,071 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. వీరికి విద్యను బోధించడానికి 11,207 మంది వాలంటీరు ఉపాధ్యాయులను నియమించామన్నారు.

పాఠశాల తరహాలో తరగతులను నిర్వహించి, వచ్చే మార్చిలో నిర్వహించే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. ఇందుకోసం పటిష్టమైన ప్రణాళికతో బోధన సాగించాలని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకుడు ముద్దాడ వెంకటరమణ, సహాయ సంచాలకులు ఎ.సోమేశ్వరరావు, అన్ని మండలాల అభివృద్ధి అధికారులు, వెలుగు సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, ఉపాధి హామీ అధికారులు, పట్టణ ఉపాధి మిషన్ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వజ్రోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వేడుకల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొనున్న ఈ ఉత్సవాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, భద్రత, మెడికల్, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రత్యేకతలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రతి కార్యక్రమం ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ, సావనీర్ కమిటీ, సాంస్కృతిక కమిటీ, ఆతిథ్య కమిటీలను ప్రకటించారు. సావనీర్ పత్రికలో జిల్లాకు కీర్తి తీసుకొచ్చిన వ్యక్తులు, స్వాతంత్ర్య సమరయోధులు, కీర్తిశేషుల జీవిత విశేషాలు పొందుపర్చాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, ఆధ్యాత్మిక, కళా, సేవా రంగాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

పర్యాటక స్థలాలపై ప్రత్యేక బ్రోచర్ ఆవిష్కరణ

జిల్లాలో చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భౌగోళిక ప్రాధాన్యత కలిగిన ప్రధాన ఆకర్షణీయ ప్రదేశాల వివరాలతో రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఇంటాక్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యాన రూపొందించిన ఈ బ్రోచర్‌లో జిల్లా విశిష్టతను ప్రతిబింబించే ప్రదేశాల వివరాలు పొందుపరిచారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు, కోటలు, తీర్థక్షేత్రాలు, ప్రకృతి అందాలు, ఆదివాసీ ప్రాంతాలు, సాంస్కతిక కేంద్రాల విశేషాలు ఇందులో ఉన్నాయి.

ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథం నాయుడు మాట్లాడుతూ 'దర్శించండి, ఆనందించండి, తరించండి' అనే నినాదంతో ఈ బ్రోచర్‌ను తెచ్చామని, ఇది పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, సిపిఒ సిపిఓ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

చేనేతను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్దది చేనేత రంగమని, అటువంటి రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని నగరంలోని బాపూజీ కళామందిర్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో డిమాండ్ ఉంటే భావితరాలు చేనేత వస్త్రాలు వాడేందుకు ముందుకు వస్తారన్నారు. చేనేత వస్త్రాలను వినియోగించి చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. చేనేత వస్త్రాల కొనుగోలుతో చేనేత కార్మికులు అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న భరోసాను రూ.24 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంతో పాటు నేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కల్పించడానికి కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. జిఎస్‌టిపై ఐదు శాతం రాయితీ, చేనేత ఇన్సూరెన్స్ వంటి పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత వస్త్రాలు ఈ-కామర్స్ ద్వారా అమ్మేందుకు, కొత్త డిజైన్లపై నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామని హామీనిచ్చారు.

నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్‌కృష్ణ మాట్లాడుతూ 500 మంది చేనేత కార్మికులతో ఉత్పత్తి సంఘం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం పలువురు చేనేత ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ముందుగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి బాపూజీ కళామందిర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఎడి టి.జనార్ధనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, చేనేత సొసైటీల అధ్యక్షులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఎంఇఒ-2ను సస్పెన్షన్ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డిఇఒకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలతో లాలూచీ పడుతున్న శ్రీకాకుళం ఎంఇఒ-2 కృష్ణారావును సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పట్టించుకోకపోగా, ఆయన దృష్టికి తీసుకెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులపై దురుసుగా సమాధానాలు చెప్పారని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ విజయ కుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పి.ఖగేశ్, చందు, జీవన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వీర్ పరివార్ సహాయత యోజన ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్యోగ విరమణ చేసిన సైనికుల న్యాయ అవసరాల పరిష్కారానికి తోడ్పడేలా 'జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వీర్ పరివార్ సహాయత యోజన-2025 అనే కొత్త పథకాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభించింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా ఈ పథకాన్ని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ సర్వీస్ క్లినిక్ ద్వారా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లీగల్ సర్వీస్ క్లినిక్‌లో ప్యానెల్ లాయర్, పారాలీగల్ వాలంటీర్‌ను నియమించామన్నారు. వీరి సేవలను సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

న్యాయపరంగా ఎదురయ్యే పలు సమస్యలకు ఉచిత సలహాలు, సాయం అందించేందుకు ఈ క్లినిక్ పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్యానల్ అడ్వకేట్ వి.జ్యోతిర్మయి, పారాలీగల్ వాలంటీర్ కె.ఆదిత్య కుమార్, అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, ఇన్‌ఛార్జి సూపరిటెండెంట్ ఎస్.ఈశ్వరరావు, మాజీ సైనికులు కెప్టెన్ పి.ఈశ్వరరావు, ఎస్.ఎన్ మూర్తి, కె.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శిక్షణా కేంద్రాన్ని సిద్ధం చేయాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ రానున్న రోజుల్లో శిక్షణ పొందేందుకు మైదానం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని తండేవలసలో గల జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని ఎస్‌పి గురువారం పరిశీలించారు. మైదానం, తరగతి గదులు, బ్యారెక్స్, మంచినీటి సరఫరా, మెస్, భోజనం, స్నానపు గదులు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను తనిఖీ చేశారు. శిక్షణకు అవసరమైన వస్తు సామగ్రి, మౌలిక సదుపాయాలు, మరమ్మతుల ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, సిఐలు ఇమ్మాన్యుల్ రాజు, పైడిపు నాయుడు, అవతారం, ఆర్‌ఐలు నర్సింగరావు, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S.732/2016

Between:
Parimi Lakshmi ...Plaintiff
And:
Thammina Simhadri Naidu & others ...Defendants

SUMMONS

To,
D-7: Yapara Jyothi,
W/o. Chandra Sekhar,
aged 35 years,
R/at Ampalem Village,
Polaki Mandal,
Srikakulam District.

Please take notice that the above named plaintiff has filed O.S.732/2016 seeking a declaration of absolute ownership over the plaint schedule property and other related reliefs. The case is posted for hearing on **21-08-2025 at 10:30 A.M.** You are hereby directed to appear before the Hon'ble Court either in person or through a legal representative on the specified date and time to respond to all matereal questions. Failure to appear may result in the suit being heard and decided ex-parte in accordance with law.

(By Order of the Hon'ble Court)
B.K. NAIDU,
Advocate, Visakhapatnam,
Cell:98480 77747.

బహిరంగ ప్రకటన
మహారాశ్రీ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టు నరసన్నపేట నందు
O.S.No: 83/2024

Between: -
జామి శ్రీనివాస రావు ......వాది
And:-
బలగ వెంకటరమణ .....ప్రతివాది

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పైనెంబరు కేసు వాది మీపైన అనగా ప్రతివాది అయిన **బలగ వెంకటరమణ,** S/o లేటు ఆటకేశము వయసు 43 సం॥, కరజాడ గ్రామం, బైరి పోస్టు, శ్రీకాకుళం మండలం మరియు జిల్లా వాదిపై మహారాజశ్రీ నరసన్నపేట వారి కోర్టు నందు O.S.No. 83/2024 నెంబర్ గల సివిల్ దావా వేసి సదరు దావాలో ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి సమన్సు ఉద్దేశ పూర్వకంగా తీసుకోనందున శ్రీ కోర్టు వారు సదరు విషయము బహిరంగ ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఆదేశించి పై నెంబర్ గల కేసు నందు మీ యొక్క వ్యక్తిగత హాజరు నిమిత్తము **తేది 13-08-2025 కు వాయిదా వేసియున్నారు.** కావున ఇందు మూలంగా బలగ వెంకటరమణ, S/o లేటు ఆటకేశము అను మీకు తెలియజేయునది ఏమనగా **తేది 13-08-2025 న ఉ॥ 10-30 ని॥ లకు** మీరు స్వయంగాగాని మీ వకీలు ద్వారా గాని మహారాజశ్రీ పై నుదహరించిన కోర్టు నందు హాజరు కావాలని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. అందుకు తప్పిన యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షములో శ్రీ కోర్టు వారు తగు ఆదేశాలు జారీ చేయుదురు.

// శ్రీ కోర్టు వారి ఆర్డ్రత మేరకు //
కొంకెన జగన్మోహనరావు
వాది తరుపు న్యాయవాది, ఫోన్: 98496 47670.

పరిశీలిస్తున్న జెఇ శ్యామలరావు

సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా మాకు అవకాశం ఉన్నంతవరకు చేస్తామని వంశధార జెఇ శ్యామలరావు తెలిపారు. జమ్ము కూడలి వద్ద ఉన్న 24 ఆర్ నరసన్నపేట బ్రాంచ్ కెనాల్‌ను గురువారం పరిశీలించారు. నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు ఎక్కడైనా అడ్డు కట్టాడాలు ఉన్నాయా, అలాగే గుర్రపు డెక్క ఉన్న ప్రాంతాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎగువ నుంచి రావలిసిన నీరు తక్కువగా వస్తుందని, వచ్చిన నీరు అన్ని ప్రాంతాలకూ వెళ్లినట్లు చర్యలు తీసుకుంటానని తెలిపారు. లింగాలవలస నుంచి 12 కిలో మీటర్ల పొడవున పోలాకి మండలంలో జిల్లెడి, మాకివలస వరకు వస్తుందన్నారు. వీటి పరిధిలో 16 డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 37 వేల ఎకరాల విస్తీర్ణం ఉందని పేర్కొన్నారు. ఇందులో 15 టిఇ, 16 టిఇ ద్వారా కెపి వలస నుంచి సుసరాం వరకు సాగు నీరు సరఫరా అవుతుందని తెలిపారు. ప్రస్తుతం వర్షాభావం పరిస్థితి వల్ల రైతులు కొంతవరకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయనతో పాటు సత్యవరం నీటి సంఘం అధ్యక్షుడు శిమ్మ లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

నారీశక్తిపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



మాట్లాడుతున్న డిఎస్‌పి అప్పారావు

నారీశక్తిపై అవగాహన పెంచుకోవాలని పలాస డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలలో కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి జోహార్‌ఖాన్ అధ్యక్షతన నారీశక్తి, సైబర్ నేరాలు, యాంటీ నార్కోటిక్స్ అంశాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల భద్రత కోసం జ్ఞాన భారతి పాఠశాల తీసుకుంటున్న చర్యలను అభినందించారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ విద్యపై, లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, పరిపాలన అధికారి సయదాసుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చేనేత వస్త్రాల బహూకరణ

చేనేత వస్త్రాలను బహుకరిస్తున్న కార్మికులు

లావేరు: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని అప్పాపురానికి చెందిన చేనేత కార్మికులు, టిడిపి నాయకుడు బాసిన దాలిరాజు ఆధ్వర్యాన ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు గురువారం చేనేత వస్త్రాలను బహుకరించారు. అనంతరం చేనేత కార్మికులకు నేతన్న భరోసా రూ.25 వేలు ఆర్థికసాయాన్ని ఇవ్వడం, మరమగ్గాలు, చేతిమగ్గాలు కలిగి ఉన్న చేనేత కార్మికులకు 200, 500 యూనిట్లకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిఆపరు. కార్యక్రమంలో బట్ట శ్రీను, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

గోదాం సిబ్బందిపై బదిలీ వేటు

ప్రజాశక్తి- లావేరు

మండల పౌరసరఫరాల గోదాం సిబ్బందిపై జిల్లా అధికారులు బదిలీ వేటు వేశారు. లావేరు, రణస్థలం మండలాల్లోని రేషన్ డిపోలకు సరుకులు వేసే క్రమంలో లావేరు గోదాం వద్ద తూకంలో మొసంతో ప్రతినెలా ప్రతి డీలర్లకూ రెండు నుంచి నాలుగు వందలు కిలోలు మేర బియ్యం తక్కువగా వచ్చేది. దీంతో డీలర్లు తీవ్రంగా నష్టపోవడం మూడేళ్లుగా జరుగుతుండేది. ఈ తతంగం అంతా కంప్యూటర్ ఆపరిటర్ అమర్ కుమార్, సెక్యూరిటీ గార్డు కరుణాకరరావులు కుమ్మక్కై తూకంలో భారీ మోసానికి పాల్పడ్డారు. ఇటీవల ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ సరుకులు జులైలో డిపోలకు బియ్యాన్ని తరలించడంతో లావేరుకు చెందిన కొందరు డీలర్లు గోదాం వద్ద తూకం వేసి తమ డిపోకు వచ్చిన బియ్యాన్ని ప్రైవేటు వేబ్రిడ్జి కాటపై తూకం వేశారు. అందులో 280 కిలోల బియ్యం తక్కువగా రావడంతో వెంటనే వారు గత మూడేళ్లుగా చేస్తున్న తూకంలో మోసం బయట పడటంతో వాళ్లని నిలదీశారు. అనంతరం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, లావేరు తహశీల్దార్ జిఈఎల్ఈ శ్రీనివాసరావులకు ఫిర్యాదు చేశారు. గోదాం వద్ద సిబ్బంది తూకంలో మోసం చేయడంతో తాము ప్రతినెలా నష్టపోతున్నామని, అక్కడ సిబ్బందిని మార్చితే కానీ మేము డిపోలను నడపలేమని వాపోయారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించాచి బదిలీ వేటు వేశారు. కంప్యూటర్ ఆపరేటర్ అమర్ కుమార్‌ను కొత్తూరు మండలానికి, సెక్యూరిటీ గార్డును సరుబుజ్జిలి మండలానికి బదిలీ చేశారు. కొత్తూరు సిఐగా పనిచేస్తున్న వడగా గోపాలరావును లావేరుకు, పొందూరులో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు కిల్లి శ్రీనివాసరావును లావేరుకు బదిలీ చేసినట్లుగా డిఎం ఉత్తర్వులు జారీ చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

డీలర్ల హర్షం

ఇదిలా ఉండగా మండల పౌరసరఫరాల గోదాం సిబ్బందిపై బాధిలీ వేటు వేయడంపై లావేరు, రణస్థలం మండలాలకు చెందిన రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా తాము ఎంతగానో నష్టపోయామని, ఇకనుంచైనా మాకు కష్టాలు తొలగడం సంతోషంగా ఉందని డీలర్ల సంఘం నాయకులు ముప్పిడి రమేష్, బాడిత హరికృష్ణ, ఇజ్జు సత్తిబాబులు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు కథనాలు రాసి సమస్య పరిష్కారానికి తోడ్పాటు అందించిన 'ప్రజాశక్తి'కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని మూలసవలాపురం పంచాయతీ పరిధిలోని తురకపేటకు చెందిన గదిలి రమణమూర్తి (52) భార్యతో వచ్చిన మనస్పర్ధలు కారణంగా మనస్తాపానికి గురై బుధవారం ఇంటి వద్దే గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పరిస్థితిని గమనించిన అతని భార్య వెంటనే భర్తని 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి గురువారం వేకువజామున కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న రిమ్స్ ఒపి పోలీసులు సరుబుజ్జిలి ఎస్ఐ హైమావతికి సమాచారం అందించారు. ఎస్ఐ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని బంధువులతో మాట్లాడి మృతదేహాన్ని మళ్లీ రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురేఖ పాణిగ్రహి చిరస్మరణీయులు

ప్రజాశక్తి- పలాస

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

భారత విప్లవ సాంస్కృతోద్యమ నాయకులు సుబ్బారావు పాణిగ్రహి సహచరి సురేఖ పాణిగ్రహి చరిత్రలో చిరస్మరణీయంగా మిగిలిపోతారని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడులో గురువారం సంతాప సభ అమరుల బంధుమిత్రుల సంఘం జిల్లా బాధ్యులు తామాడ త్రిలోచనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళ ఉద్యమంలో పాణిగ్రహి నాయకత్వ పాత్రను, అదే సమయంలో మితవాదులకు వ్యతిరేకంగా పాత్రను వివరించారు. విరసం అధ్యక్షులు అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ అమరుల వారసత్వాన్ని కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. అరుణోదయ రాష్ట్ర బాధ్యులు సన్నశెట్టి రాజశేఖర్ రచన చేసిన పాటలను ఆట పాటలతో ప్రజలను ఉత్తేజపరిచారు. జముకుల కథ పాటలను వినిపించారు. రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు వర్మ మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం సంక్షోభంలో ఉందన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా బాధ్యుల పత్తిరి దానేష్ మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని అన్నారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర నాయకులు సిహెచ్.కృష్ణ, ఐప్వా నాయకులు కామ్రేడ్ తామాడ పోతనపల్లి అరుణ, పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, దాసరి శ్రీరాములు, కైలాస్, మురళి, నాగమణి దీపు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

టెక్కలి రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

టెక్కలి రూరల్ : పులివెందులకు చెందిన వైసిపి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి ఖండిస్తూ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యాన టెక్కలిలో భారీ శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందులో జెడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో ఓటర్లను భయభ్రాంతులకు గురుస్తున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న రాయలసీమలో టిడిపి నాయకులు మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మార్పు పృథ్వీరాజ్, ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: వైసిపి రాష్ట్ర బిసి విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జెడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్నప్పుడు టిడిపి నాయకులు దాడి చేయడం అమానుషమని జాతీయ బిసి సంఘం జాతీయ కార్యదర్శి, అఖిల భారత యాదవ మహాసభ (అహీర్) రాష్ట్ర అధ్యక్షులు, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు గద్దె బోయిన గుర్నాథ్ యాదవ్ ఖండించారు. గురువారం ఆయన కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడారు. జెడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీపై దాడి చేసిన తీరు చూస్తే.. ఒక పథకం ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడమేనని అన్నారు.

ఇచ్ఛాపురం : వైసిపి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి సరికాదని వైసిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ అన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థుల సత్తా

ఎచ్చెర్ల : నరసన్నపేట స్థానిక ఉన్నత ప్రభుత్వ పాఠశాల వేదిక ఈ నెల 3న యోగా స్పోర్ట్ అసోసియేషన్ వివేకానంద జ్ఞాన యోగ సమితి ఆధ్వర్యాన నిర్వహించిన యోగా పోటీల్లో ట్రిపుల్ ఐటి విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా వ్యాప్తంగా 250 మంది పాల్గొనగా, ట్రిపుల్ ఐటికి చెందిన 19 మంది విద్యార్థులు పథకాలు సాధించారు. వీరు ఈ నెల 21న నుంచి పశ్చిమగోదావరి జిల్లా పత్తిపాడులో నిర్వహించ నున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, ఎఒ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివరామకృష్ణ, ఎపిఒ వాసు, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక 11కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంక సబ్ స్టేషన్ పరిధిలోని బొరివంక ఎగువ వీధి, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగానపుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న జోగేంద్రనాయుడు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నందిగాం : మండలంలోని మొండిరావివలసలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం పెద్దతామరపల్లి యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఇ.దీప్తిరేఖ ఆగురువారం అవగాహన కల్పించారు. వివిధ రకాలైన ఇన్స్యూరెన్స్‌లు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు సలాన జోగేంద్రనాయుడు, ఎం.రాములు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేసి 10.180 కేజీల గంజాయిని స్వాధీన చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్రకు చెందిన విశాల్ రమేష్ కీర్తన్ మండలంలోని ఎం.తోటూరు పరిధిలోని ఎల్‌సి గేటు దగ్గర గంజాయితో పట్టుబడ్డారని అన్నారు. నిందితుడిని అరెస్టు చేసి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు 'శ్రావణ' సందడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో పెద్దమార్కెట్, రైతు బజారుల్లో గురువారం శ్రావణ శుక్రవారం సందడి నెలకుంది. మహిళలు లక్ష్మి పూజలకు సిద్ధమవుతున్నారు. పండ్లు, పువ్వులకు డిమాండ్ ఏర్పడింది. రేట్లు సైతం ఒక్కసారి పెరిగాయి. మూడో శుక్రవారం వారం కావటం, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ప్రత్యేకంగా మహిళలకు సెలవు ప్రకటించారు. ఆలయాల్లో సైతం నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సౌమ్య

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం.ద్రాక్ష, డి.హాసినిలు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.రూపవతి గురువారం తెలిపారు. అండర్-18 విభాగంలో ఎం.ద్రాక్ష, అండర్-16 విభాగంలో డి.హాసినిలు ఈ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 11 వరకు చీరాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. వీరికి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

యాప్‌ల భారం తగ్గించాలి

ప్రజాశక్తి- కవిటి

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులపై విద్యాశాఖ మోపుతున్న యాప్‌ల భారం, ఆన్‌లైన్ పనుల ఒత్తిడి తొలగించి వారిని బోధనకే పరిమితం చేయాలని ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన డిఎలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరులు మాట్లాడుతూ ఎంటిఎస్ ఉపాధ్యాయుల ఉద్యోగుల విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జితేంద్ర, మండల అధ్యక్షుడు బల్ల ధర్మారావు, గౌరవాధ్యక్షుడు కొత్తపల్లి రంగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శమల్ల రాజబాబు, శ్రీరామ్మూర్తి బిసాయి, మొర్రి గోపి పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ ఈశ్వరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అవినీతిపరునికి కేరాఫ్ అడ్రస్‌గా టిడిపి నాయకుడు పుచ్చ ఈశ్వరరావు నిలుస్తారని ఎఎంసి మాజీ చైర్మన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ నాయకులు జగన్మోహన్ రెడ్డి, సీదిరి అప్పలరాజు, తనపైన తన భార్య జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణిపైన అసత్య ఆరోపణలు చేస్తూ టిడిపి పెద్దల ప్రపకం కోసం ప్రాకులాడుతున్నారని అన్నారు. గోవిందపురం సరిహద్దులోని ప్రతాప విశ్వనాధాపురం రెవెన్యూలోని సర్వే నంబరు 93/1లో 23 సెంట్ల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసి రియల్ ఎస్టేట్ చేసి లక్షల్లో సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. తన చెల్లెలు గొరకల సావిత్రి భూమిపై తప్పుడు అగ్రిమెంట్ చూపించి ఫోర్జరీ సంతకాలతో ఆమెపై వేసిన కేసులు బండారం త్వరలోనే న్యాయస్థానంలో బట్టబయలు అవుతుందని అన్నారు. గోవిందపురం గ్రామపెద్ద కుటుంబ సభ్యులు పేరుతో ఉన్న సుమారు మూడు ఎకరాల భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి తన పేరు మీద మార్చుకున్నారని అన్నారు. ఈ విషయం తెలిసిన గ్రామ పెద్ద న్యాయస్థానాన్ని ఆశ్రయించారని అన్నారు. గోవిందపురం గణియబంధ చెరువు గట్టు పైన బడ్డి కొట్టులు పెట్టుకుని జీవనోపాధి పొందే చిరు వ్యాపారుల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.పది వేలు నుంచి రూ.15 వేలు వరకు అక్రమ వసూళ్లకి పాల్పడిన చరిత్ర టిడిపి నాయకుడు ఈశ్వరరావుది అన్నారు. చదునపల్లి సింహాచలం ఆస్తిని తనకు ఆపాదించి రచ్చ చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున న్యాయస్థానంలో పేదవాడికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు వైసిపి యువ నాయకుడు, సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు ఉన్నారు.

సాంస్కృతిక వారసత్వానికి చేనేత చిహ్నం

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- పలాస

చేనేత రంగం సాంస్కృతిక వారసత్వానికి చిహ్నమని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అనేక కుటుంబాలకు జీవనోపాధిగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో పనిచేసే కార్మికుల్లో అధిక భాగం స్త్రీలే కావడం, మహిళా సాధికారతకు గొప్ప ఉదాహరణ అని అన్నారు. 1905 ఆగస్టు 7న ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం, దేశీయ పరిశ్రమల అభివృద్ధికి బలం ఇచ్చిందని అన్నారు. అనంతరం విద్యార్థులకు చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.గిరిజ, సునీత పాల్గొన్నారు.

కలుపు నివారణ చర్యలు చేపట్టాలి

వ్యవసాయశాఖ ఎడి మధు

నరసన్నపేట: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో నరసన్నపేట మండలంలో అధిక శాతం వరి సాగులో రైతులు ఎదలు వేశారని, రైతులు కలుపు నివారణా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఎడి ఎల్.వి.మధు సూచించారు. నరసన్నపేట ఎడి కార్యాలయంలో 'ప్రజాశక్తి' విలేకరుతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. నరసన్నపే మండలంలో 18,265 ఎకరాల వరిసాగు విస్తీర్ణం ఉండగా, ఇందులో 17,155 ఎకరాల వరకు ఎదలు వేశారన్నారు. ఎదలు వేసేటప్పుడు ప్రధాన సమస్య కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. వీటికి ముఖ్యంగా పంట వేసే కాలం 25-30 రోజుల మధ్య బిస్‌పై బాక్ సోడియం 120 ఎంఎల్, ఆల్ మిక్స్ అనే కలుపు మందు 8 గ్రాములు కలిపి 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కౌన్సిల్ ఎకైబా 90 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో సరిపడా తేమ ఉన్నట్లు చూసుకుని పిచికారీ చేస్తే వరి పొలంలో వచ్చు అన్ని కలుపు సమర్థవంతంగా నివారించవచ్చు అని అన్నారు. ఎరువులు వేసేటప్పుడు వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు.

గ్యాస్‌కి ఇకెవైసి తప్పనిసరి

వెంకటరావు

కవిటి: భారత్ గ్యాస్ వినియోగదారులందరూ తక్షణమే ఇకెవైసి (ఆధార్ ఆధారిత వినియోగదారుల ధ్రువీకరణ) ప్రక్రియను పూర్తిచేయాలని చింతామణి భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కొండేటి వెంకటరావు ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికీ ఇకెవైసి చేయించుకోని వినియోగదారులు వారం రోజుల్లోగా తమ ఆధార్ కార్డు, గ్యాస్ బుక్‌తో కలిపి చింతామణి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి హాజరై ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 15 తర్వాత కూడా ఇకెవైసి పూర్తి చేయని వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ సరఫరా నిలిపివేసే అవకాశముందని స్పష్టం చేశారు. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

రాపాకలో ఇంటింటా సర్వే

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఒ వాణీకుమారి ఆధ్వర్యాన గురువారం ఇంటింటా వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. గ్రామంలో అనుమానిత డయేరియా కేసులు రావడంతో ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. జ్వరాలు, విరోచనాలు, జలుబులు వంటి సీజనల్ వ్యాధుల గురించి వివరాలను సేకరించారు. అలాగే గ్రామంలో తాగునీటి వసతులను, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం కార్యదర్శి పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో పలు వీధుల్లోని మురుగు కాలువలతో పాటు, అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లి శుభ్రపరిచారు. ఈ సర్వేలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలువలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారులతో రాజేష్

సోదరభావానికి రక్షాబంధన్ ప్రతీక

కవిటి: సోదరభావానికి ప్రతీకగా రక్షా బంధన్ నిలుస్తుందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ అన్నారు. స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో ముందస్తు రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేష్‌కు చిన్నారులు రాఖీ కట్టి ఆశీసులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థలాలు పరిశీలన

కొత్తూరు : మండలంలోని మెట్టూరు, నివగాం గ్రామాల్లో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి నాలా కన్వర్షన్ స్థలాలను గురువారం పరిశీలించారు. మెట్టూరు పిహెచ్‌సి స్థలాన్ని కూడా పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో, సర్వేయర్లతో సమీక్షించారు. రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో ప్రగతిని పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ కె.బాలకృష్ణ, మండల సర్వేయర్ గురవయ్య, విఆర్‌ఒలు ఉన్నారు.

శివారు ఆయకట్టుకు నీరందించాలి

వినతిపత్రం అందజేస్తున్న దుర్గారావు

పలాస : వంశధార ప్రధాన ఎడమ కాలువ చివరి ఆయకట్టులో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 18,228 ఎకరాలకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావు కోరారు. విజయవాడలో జల వనరులశాఖ ప్రధాన కార్యాలయంలో ఎపి జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కె.నరసింహమూర్తిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వెంటనే గొట్టా బ్యారేజీ నుండి ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారని, ఇప్పటికీ ఆయకట్టు శివారు ప్రాంతాలకు నీరు అందలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలువ ఎగువ ప్రాంతంలో ప్రధానంగా 24 నరసన్నపేట బ్రాంచ్ ఛానల్, మేఘవరం ఛానల్‌కు నీటిని విడుదల కొంతమేర తగ్గించి దిగు ప్రాంతానికి అందించాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శన కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఆర్‌డిఒ జర్నలిస్టుల వివరాలు, ధ్రువీకరణ పత్రాలు కార్యాలయానికి అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గనియా శ్రీనివాసరావు, పొట్నూరు వినయాకరావు, ఎం.పద్మలోచనరావు, ఎస్.రాజశేర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆగని మట్టి తరలింపు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలంలోని భానోజీరావుపేటలో మట్టి మాఫియా తరలింపు కొనసాగుతుంది. అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులకు పట్టకపోవడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా మండల పరిధిలో ఎస్ఎం పెద్ద చెరువులను, కేశవరావుపేట పంచాయతీ పరిధిలోని బుద్ధవాని చెరువు, అదే గ్రామానికి చెందిన చీడికాని చెరువు, ఇటీవల భానోజీరావుపేట కొండ ప్రాంతాలు, పలు చెరువుల్లో ఇష్టారాజ్యంగా మట్టి తరలిపోతుంది. అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ బి.గోపాలరావును ఫోన్‌లో వివరణగా ఫోన్ అందుబాటు లేదు.

మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి మేలు

రణస్థలం రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసిడిఎస్ పైడిభీమవరం సెక్టర్ సూపర్‌వైజర్ ఎం.శ్రీలక్ష్మి అన్నారు. పైడిభీమవరం పంచాయతీలో తల్లిపాలు వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లి అందించే పాలు వ్యాధినిరోధక శక్తితో పాటు, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తుందన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతం కన్నా మిన్న అని, పాలిచ్చే తల్లులకు కలిగే లాభాలు, డబ్బా పాలు వలన కలిగిన నష్టాలన వివరించారు. అనంతరం బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రమీళ, ఆశా వర్కర్ పద్మావతి, గోవిందమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ప్రకాష్

ఘనంగా ప్రకాష్ జన్మదిన వేడుకలు

కవిటి: ఎంపిపి ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ జన్మదిన వేడుకలు అతని స్వగ్రామం శిలగాంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, అధికారులు, అనధికారులు ప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాజకీయ జీవితం మరింత ఉజ్వలంగా 'ప్రకాశ'యించాలని ఆకాంక్షించారు.

మహనీయుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- కవిటి

మహనీయుల సేవలు మరువలేనివని కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి అన్నారు. ఠాగూర్ వర్థంతి, ఎంఎస్ స్వామినాథన్ జయంతిని పురస్కరించుకుని గురువారం పాఠశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఠాగూర్, స్వామినాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారత జాతీయ గీతాన్ని రచించిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆసియాలో తొలిసారి నోబెల్ బహుమతి పొందిన సాహితీవేత్తగా గుర్తింపు పొందారని తెలిపారు. బ్రిటిష్ ప్రభుత్వం అందించిన నైట్ హుడ్ అవార్డును జలియాన్వాలా బాగ్ ఘటనకు నిరసనగా తిరస్కరించిన ఘనత ఆయనదని అన్నారు. విద్యార్థుల విద్య కోసం శాంతినికేతన్‌ను స్థాపించిన వ్యక్తని వివరించారు. అలాగే హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ జీవిత విశేషాలనూ విద్యార్థులకు తెలియజేశారు. మొక్కలపై చేసిన పరిశోధనలు, ప్రకృతి పరిరక్షణలో ఆయన పాత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రపటాల వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

జోషిబాబుకు ఆత్మీయ సత్కారం

జోషిబాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఇటీవల సివిల్ సర్వీస్‌కు ఎంపికైన లింగుడు జోషి బాబుకు అగ్నికుల క్షత్రియ సంఘం తరుపున గురువారం సన్మానించారు. మండలంలోని చలమయ్యపేటలోని అతని స్వగృహంలో అమలపాడు గ్రామస్తులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ జోషిబాబును ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని అన్నారు. జోషిబాబు ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 18న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు బాలరాజు, రాజ్యలక్ష్మిను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దున్న బాలరాజు, ఎంపిటిసి దున్న లోకనాథం, వైస్ సర్పంచ్ కరడ గిరి, గ్రామ పెద్దలు లింగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

బాలికలకు ముగ్గుల పోటీలు

పోటీలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఇచ్ఛాపురం: రోటరీ క్లబ్ యువజన మాసోత్సవాలు సందర్భంగా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ముగ్గులు పోటీలు పెట్టారు. పట్టణంలో పలు విద్య సంస్థల నుంచి వంద మంది వరకు వరకు బాలికలు ముగ్గులు పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి ఎన్.లక్ష్మి, ద్వితీయ బహుమతి కావ్య, తృతీయ బహుమతి వినీలా గెలుచుకున్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ మోహన్ వెంకటేష్, కార్యదర్శి కాదా రామకోటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు కె.రామారావు, డాక్టర్ వ్యాధ వ్యాస, పైడి శెట్టి దినేష్, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, షణ్ముఖరావు, పాక తులసీదాస్, డి.కృష్ణారావు, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అందించిన 'స్నేహ హస్తం'

కవిటి: వారంతా 1984-89లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. నాలుగు దశాబ్దాల అనంతరం ఇటీవల మళ్లీ అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఆ సమయంలో తమతో చదువుకున్న స్నేహితుడు గుడియా రవి చనిపోయాడని విషాద వార్త తెలుసుకున్నారు. ప్రస్తుతం వారి కుటుంబం ఆర్థిక సమస్యల్లో ఉన్నట్టు గుర్తించారు. దీంతో చేయిచేయి కలిపి తమవంతుగా 31వేలు పోగుచేశారు. ఆ మొత్తాన్ని నెయ్యల నీలాంబర్, బాలక శ్రీనివాసరావు, గొరకల రామారావు, దాసరి కృష్ణారావు, దున్న షణ్ముఖరావు, పిరియా లక్ష్మీనారాయణలు ఈ మొత్తాన్ని తమ స్నేహితుని భార్యకు అందించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఎచ్చెర్ల: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెట్ పద్మనాభరాజు అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ వద్ద ఐఆర్ బెటాలిన్ సమీపంలో విద్యార్థులతో కలిసి పాత జాతీయ రహదారి డివైడర్‌పై నీడ నిచ్చే మొక్కలను గురువారం నాటారు. ప్లాస్టిక్‌ను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా వీటిని నిర్ణీత ప్రదేశాల్లో వేసి నిర్వీర్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి జి.నాగేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమాండర్ పి.నాగశ్రీనివాసరావు, ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

తాగునీటి బోరుకు శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు: మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు బావి నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ గూడ గిరిజ తెలిపారు. గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి బోరు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు తాగునీరు కొరత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపిపి మండల పరిషత్ నిధులు మంజూరు చేశారని అన్నారు. దీంతో సర్పంచ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణారావు, గ్రామ పెద్దలు గూడ ఈశ్వరరావు, వార్డు మెంబర్లు చెల్లూరు దనరాజు, చొక్కర శేషగిరి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గిరిజ

ధనలక్ష్మికి డీలర్‌షిప్‌ను పునరుద్ధరించాలి

వైసిపి సమన్వయకర్త రవికుమార్

పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మునగవలసకు చెందిన మునగవలస ధనలక్ష్మి నిర్వహిస్తున్న రేషన్ డిపోను కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొలగించిందని, వెంటనే తిరిగి ఆమెకు కేటాయించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ధనలక్ష్మిని రవికుమార్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధనలక్ష్మి రేషన్ డిపోను తొలగించిన నేపథ్యంలో రెండు రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. ఈ ఘటనపై కలెక్టర్ వెంటనే స్పందించి బాధితురాలికి రేషన్ డిపోను తిరిగి కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈయన వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

మోసపూరిత హామీలతో అధికారం

ప్రజాశక్తి- పొందూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత హామీలతో గద్దెనెక్కి, వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఆధ్వర్యాన తండ్యాం, మలకాం, దళ్లిపేట పంచాయతీల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకే ఇంటింటికీ వెళ్లారు. కార్యక్రమంలో కిల్లన సూర్యారావు, వడగ మోహన్, జాడ అప్పలనాయుడు, గూనాన కృష్ణ, గాడు నాగరాజు, గుడ్ల మోహన్, చింతాడ సత్యప్రసాద్, కంబావు సూర్యారావు, కూన అన్నంనాయుడు, జమ్మినాయుడు, బొడ్డేపల్లి ప్రసాద రావు, పైడి పోలయ్య, గార వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- లావేరు

లావేరులో ఉద్యోగం చేయడం జీవితంలో మరువలేనిదని గుమ్మడాం కార్యదర్శి కెళ్ల రామకృష్ణ అన్నారు. లావేరు సచివాలయంలో గురువారం సన్మానించారు. ఎచ్చెర్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర మాట్లాడుతూ ఇక్కడ పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కరించడానికి, గ్రామాల అభివృద్ధికి అంతా కలిసికట్టుగా పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అప్పలనాయుడు, సర్పంచ్ ప్రతినిధి లంకలపల్లి మహేష్, ఎంపిటిసి యినపకుర్తి సతీష్, మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని కంబాలరాయుడుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కొత్తూరు చిన్నవాడు అందించిన సేవలు ఆదర్శనీయమని సర్పంచ్ వంక చిరంజీవి కొనియాడారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఆయనను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి కారి వెంకటరావు, మాజీ సర్పంచ్ కంబాల దానేష్, గురునాథం, శివాజీ, ఉపాధ్యాయ సిబ్బంది తులసీదాస్, వెంకటరమణ, కృష్ణారావు, అనిల్ పాల్గొన్నారు.

11న జిల్లా వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం సిటీ: జిల్లా 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ (పురుషుల) జట్ల ఎంపికలు ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి నిర్వహించనున్నట్లు డిఎస్‌డిఒ శ్రీధర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొవాలన్నారు.

ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న దాతలు

అభాగ్యులకు అండగా నిలవాలి

శ్రీకాకుళం సిటీ: సమాజంలో నిరుపేదలను ఆదుకునేందుకు పౌర సమాజం సహకరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. నగరంలోని గొంటివీధి నైట్ షెల్టర్లో నిరాశ్రయులు పేదలు, వృద్ధులకు మంగువారితోట పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమం బుధవారం రాత్రి చేపట్టారు. అన్నవితరణ చేశారు. నైట్ షెల్టర్లో అభాగ్యులకు అల్పాహారం, ఫలాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు పైడి గోపాలరావు, నైట్ షెల్టర్ నిర్వాహకులు, చేయూత మేమున్నాం అధ్యక్షులు వైశ్యరాజు వెంకటలక్ష్మి, ఉర్లాం శివతేజ, పోలీస్‌శాఖకు చెందిన లోపింటి శాంతారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిఎస్‌ఎల్‌లో పాల్గొనడం అభినందనీయం

ఆమదాలవలస : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇటీవల అమెరికాలో పర్యటించి, రాష్ట్ర శాసనకర్తలకు సంబంధించిన విధాన, శిక్షణ, సాంకేతిక అంశాలపై అధ్యయనం చేయడం అభినందనీయమని టిడిపి నాయకులు పేడాడ జనార్ధనరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడారు. బోస్టన్ నగరంలో నిర్వహించిన 50 వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ స్టేట్ లెజిస్లేచర్స్ (ఎన్‌సిఎస్‌ఎల్) సమావేశంలో రవికుమార్ పాల్గొని వివిధ దేశాల ప్రజాప్రతినిధులతో చర్చించారని అన్నారు. బోస్టన్ స్టేట్ పార్లమెంటరీ హౌస్ వద్ద తీసిన ఛాయాచిత్రాలనూ ఈ సందర్భంగా విడుదల చేశారు.

ఎరువులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎరువుల పంపిణీ

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురంలో రైతులకు ఎరువులను ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ బూర్జ లలిత కుమారి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట పెట్టుబడి సాయం కింద ఏటా ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు జమ చేయనున్నారని తెలిపారు. సబ్సిడీపై అందజేస్తున్న ఎరువులు వినియోగించుకోవాలని కోరారు. వ్యవసాయ సచివాలయ అధికారి సూర్య, త్రినాథ్, సర్పంచ్ ప్రతినిధి ఒట్టు కోళ్ల శంకర్, టిడిపి నాయకులు, చెక్రి, మడపాల శశిభూషణరావు, తిరుపతిరావు, వంజంగి రమేష్, భైరాగి, ఆనందరావు పాల్గొన్నారు.

బూట్లు వితరణ

ఇచ్ఛాపురం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరుపేద క్రీడాకారులకి ఇచ్ఛాపురం బిక్స్ వ్యాపార వేత్త కీర్తిశేషులు బత్తిన మాలాద్రి చౌదరి జ్ఞాపకార్థంగా వాళ్ల కుమారులైన నాగరాజు బాలాజీ షూస్ గురువారం వితరణగా అందజేశారు. ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం సూర్యం వీటిని అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది, పీడీ గణేష్, ఇటిటి శారత పాల్గొన్నారు.